ఈనాడు హైదరాబాద్






Sunday , May 31, 2009 18:27 hrs IST

FRONTPAGE CONTACT

Hyderabad

కాంగ్రెస్‌లో చేరిపోదాం...
మహిళా ఖైదీల క్షమాభిక్షను పరిశీలిస్తాం!
ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి: మందకృష్ణ
ఎడ్‌సెట్ దరఖాస్తుదారుల్లో మహిళా అభ్యర్థులే ఎక్కువ!
భాజపా కార్యాలయం పేల్చేస్తామని లష్కరే తోయిబా హెచ్చరిక!!
రాష్ట్రంలో ఏడు బీసీ సర్కిళ్లు
నల్లజాతీయుల చైతన్య స్ఫూర్తి శ్రీవర్షిణి
అనాథల ఆశాదీపం విక్టోరియా హోం
మెట్రో రైలు... చిగురిస్తున్న ఆశలు..!
ప్రాణాలు తీసే థ్రిల్!!
ఆర్పీఎఫ్ సేవలు అభినందనీయం: జీఎం
బలాబలాల బేరీజు!
చికాగో తెలుగు అసోసియేషన్ ఆవిర్భావం
స్వైన్‌ఫ్లూ పేరుతో పందులు అమ్ముకున్నారు!!
పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి
చెడిపోయిన లిఫ్టులోంచి మంటలు
శివార్లకు సరఫరా మావల్ల కాదు..!
సీబీఎస్‌కు గుండె 'కోత'
బీటెక్ విద్యార్థులకు సున్నా మార్కులు
ఒంటరి మగువలూ.. తెగువతో జీవించండి!
జీహెచ్ఎంసీలో అగ్నిప్రమాదాల నిరోధక విభాగం
కుటుంబ కలహాలతో పిల్లలను బాధించొద్దు
కూర రాజన్న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
వినియోగాన్ని తగ్గించడమే పొదుపు..!
మూలకు చేరుతున్న బల్లలు!
మహిళను కాబట్టే ముందుగా మహిళా జైలుకు వచ్చా..!
లేఅవుట్ క్రమబద్ధీకరణ రెండో విడత ప్రారంభం
మోడల్ పరీక్షలతో విద్యార్థుల ప్రతిభ మెరుగు

## కాంగ్రెస్‌లో చేరిపోదాం...

అంబర్‌పేట తెరాస కార్యకర్తల మనోగతమిది...
విస్తుపోయి సమావేశం నుంచి నిష్క్రమించిన అభ్యర్థి జగదీశ్వర్

అంబర్‌పేట, మే 30 (న్యూస్‌టుడే): శాసనసభ ఎన్నికల్లో పార్టీకి పనిచేయని తెరాస అసమ్మతి నాయకులకు, నమ్మించి మోసం చేసిన తెదేపాకు, మతతత్వాన్ని భూతద్దంలో చూపించి లబ్ధి పొందిన భాజపాకు గ్రేటర్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలంటే కాంగ్రెస్‌లో చేరటం మంచిదని తెరాస కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గం తెరాస కార్యకర్తల సమావేశం గాంధీబొమ్మ దగ్గర ఉన్న పార్టీ కార్యాలయంలో జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అంబర్‌పేట అభ్యర్థి కె.జగదీశ్వర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. శాసనసభా ఎన్నికల్లో అంబర్‌పేటలో పార్టీ పరాజయం కావడానికి గల కారణాలను విశ్లేషించారు. సొంత పార్టీకి చెందిన నాయకులు వ్యతిరేకంగా పనిచేయడం, మహాకూటమిలో అందరి కంటే ఎక్కువ ఓట్లు ఉన్న తెదేపా మోసం చేయడం వల్లనే ఓటమి చవిచూశామని కొందరు నాయకులు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని తెరాసలో అసమ్మతిని పార్టీగ్రేటర్ ఇన్‌ఛార్జి పట్టించుకోకపోవడం, స్థానిక కమిటీలను కూడా వేయకపోవడంతో కార్యకర్తలు నిరాశకు గురై సరిగా పనిచేయలేదని మరికొందరు పేర్కొన్నారు. చివరకు అందరం కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరదామని చెప్పడంతో విస్తుపోయిన జగదీశ్వర్ మౌనంగా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశం ముగిసింది. నియోజకవర్గ కార్యకర్తల సమావేశం అయినప్పటికీ తెరాస సంయుక్త కార్యదర్శి పాకచందర్‌తో పాటు చాలామంది సీనియర్ నాయకులు ఈ సమావేశానికి హాజరు కాకపోవడం గమనార్హం.

---

## మహిళా ఖైదీల క్షమాభిక్షను పరిశీలిస్తాం!

* హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి
* చంచల్‌గూడ మహిళా జైలు సందర్శన

న్యూస్‌టుడే, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళా జైళ్లు హైదరాబాద్ (చంచల్‌గూడ), రాజమండ్రిలో మాత్రమే ఉన్నా ఖైదీల విషయంలో ఎలాంటి లోటు లేకుండా అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శిక్ష ఖరారై జైలు జీవితం అనుభవిస్తున్న వారితోపాటు అండర్ ట్రయల్ ఖైదీలు కూడా బెయిలు దొరక్క ఏళ్ల తరబడి జైలులోనే మగ్గుతుండటాన్ని స్వయంగా పరిశీలించిన ఆమె వారి క్షమాభిక్ష విషయాన్ని పరిశీలిస్తామని ప్రకటించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాష్ట్ర తొలి మహిళా హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సబితా ఇంద్రారెడ్డి మొదటిసారిగా తన అధికారిక పర్యటనలో భాగంగా శనివారం చంచల్‌గూడలోని మహిళా కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఉదయం 10.15 గంటలకు జైలుకు వచ్చిన ఆమె సుమారు గంటసేపు అక్కడ ఉన్నారు. జైలులోని వివిధ విభాగాలు, బ్యారక్‌లు సందర్శించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కనీసం బెయిలు దొరక్క ఏళ్ల తరబడి అండర్ ట్రయల్ ఖైదీలుగానే మగ్గుతున్న మహిళలు కొందరు హోంమంత్రి వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు. కొందరు ఆమె కాళ్లపై పడి తమకు క్షమాభిక్ష ప్రసాదించాలని రోదిస్తూ వేడుకున్నారు. వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించిన ఆమె ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట జైళ్లశాఖ డీజీ లోకేంద్రశర్మ, అదనపు ఐజీలు ఎం.ఆర్.అహ్మద్, నర్సింహారెడ్డి, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌బలాలా, జైలు సూపరింటెండెంట్ రహనాబేగం ఉన్నారు.

వంటకాలపై సంతృప్తి

మహిళా ఖైదీల కోసం తయారయ్యే వంటకాలు ఎలా ఉన్నాయో పరిశీలించేందుకు హోంమంత్రి వంటశాలకు వెళ్లారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనంలో ఏమేం తయారు చేస్తారో వాటి నమూనాలను చిన్నచిన్న గిన్నెల్లో హోంమంత్రి కోసం అధికారులు తయారుగా ఉంచారు. అక్కడి పరిసరాలను, వంటకాలను పరిశీలించిన ఆమె పప్పు, ఇతర వంటకాలను స్వయంగా తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. 'బాగున్నాయ్..' అంటూ కితాబిచ్చారు.

### మొన్న ములాఖత్‌కు.. నిన్న హోంమంత్రి హోదాలో..

1997లో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులో అరెస్టయి చంచల్‌గూడ పురుషుల జైలులో రిమాండ్‌లో ఉన్న తన భర్త ఇంద్రారెడ్డిని కలిసేందుకు ఆనాడు ములాఖత్‌కు సాధారణ మహిళలా వచ్చిన సబితా ఇంద్రారెడ్డి శనివారం ఏకంగా హోంమంత్రి హోదాలో చంచల్‌గూడ ప్రాంతానికి వచ్చారు. కాకపోతే ములాఖత్ కోసం వచ్చినప్పుడు ఆమె చంచల్‌గూడ పురుషుల జైలుకు వెళ్తే పన్నెండేళ్ల తర్వాత హోంమంత్రి హోదాలో మహిళా జైలుకు వచ్చారు. ఇప్పటి వరకు ఎవరికీ లభించని 'గార్డ్ ఆఫ్ ఆనర్' (గౌరవ వందనం) డిప్యూటీ జైలర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో హోంమంత్రికి లభించింది.

### ఖైదీలతోనే పిల్లలుండటం

మహిళా ఖైదీలకు చిన్న పిల్లలుంటే వారిని తల్లులతో ఉండనిచ్చే అవకాశం కేవలం మన రాష్ట్రంలోనే ఉందని హోంమంత్రి చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరేళ్ల వరకు పిల్లలూ తల్లులతో జైలులోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఫలితంగా ఈ జైలులో మొత్తం 12 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

---

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి: మందకృష్ణ

సికింద్రాబాద్, మే 30 (న్యూస్‌టుడే): కేంద్ర, రాష్ట్రాల్లో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందున ఎన్నికల హామీ ప్రకారం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ డిమాండు చేశారు. వర్గీకరణను సాధించుకునేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేసేందుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రతినిధుల సమావేశాలను జూన్ 5, 6వ తేదీల్లో నిర్వహించనున్నామని ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు దండు వీరయ్య, సంద్రువెల్లి వెంకటయ్య, బి.ఎస్.రమేష్‌కుమార్, కోడూరు నారాయణరావు, దండు సురేందర్, రాజెల్లయ్య, ఏడెల్లి యాదయ్య, చిలుక ప్రభాకర్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. వర్గీకరణ విషయమై త్వరలోనే వైఎస్, డీఎస్‌లను కలుస్తామన్నారు.

### అగ్రవర్ణాల ప్రయత్నాలే ఓడించాయి...

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మహాకూటమితో చేతులు కలిపేందుకు తాము సిద్ధపడినప్పటికీ చంద్రబాబు ఒప్పుకోకపోవడమే కూటమి ఓటమికి కారణమన్నారు. కొన్ని చోట్ల ఎమ్మార్పీఎస్ ప్రభావంతోనే కాంగ్రెస్‌కు అనుకూలత ఏర్పడిందన్నారు. తెదేపా అధినేత వైఖరి మాదిగలను ఆవేదనకు గురి చేసిందన్నారు. ఉద్యమకారులను ఎన్నికల్లో ఓడించేందుకు అగ్రవర్ణాలన్నీ సర్వశక్తులా ప్రయత్నించడం సాధారణమేనని, ఎన్నికల్లో తన ఓటమికి విచారించడం లేదని మందకృష్ణ వ్యాఖ్యానించారు. అంబేద్కర్‌కు కూడా ఓ దశలో అపజయం తప్పలేదన్నారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా వర్గీకరణ సాధనపై ఉద్యమిస్తామని చెప్పారు.

---

## ఎడ్‌సెట్ దరఖాస్తుదారుల్లో మహిళా అభ్యర్థులే ఎక్కువ!

* పెరిగిన దరఖాస్తుల సంఖ్య

* వచ్చే నెల 7న పరీక్ష... 3 వారాల్లో ఫలితాలు

ఉస్మానియా విశ్వవిద్యాలయం, మే 30 (న్యూస్‌టుడే): ఎడ్‌సెట్ దరఖాస్తుదారుల్లో మహిళా అభ్యర్థుల సంఖ్యే ఎక్కువగా ఉందని కన్వీనర్ ప్రొఫెసర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మొత్తం దరఖాస్తులు 1,35,354 రాగా అందులో 70,848 వారి నుంచే వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 320 కేంద్రాలలో పరీక్ష జూన్ 7న నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు వారాల్లో ఫలితాలను వెల్లడిస్తామన్నారు. శనివారం ఓయూ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరులతో

మాట్లాడారు. గత ఏడాది (సుమారు 92వేలు) కంటే దరఖాస్తుల సంఖ్య పెరిగిందన్నారు. హాల్‌టి క్కెట్లు ఇప్పటికే పంపించినట్లు తెలిపారు. రాని వారు నేరుగా ఓయూ వెబ్‌సైట్ ద్వారా పొందవ చ్చన్నారు. జంటనగరాలలో 35 పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. సబ్జెక్టులవారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. సోషల్ మెథడాలజీ-73,594, బయాలాజికల్ సైన్స్-30,458, గణితం-13,900, ఫిజిక్స్ మెథడాలజీ-9,122 దరఖాస్తులొచ్చినట్లు తెలిపారు.

---

## భాజపా కార్యాలయం పేల్చేస్తామని లష్కరే తోయిబా హెచ్చరిక!!

* నిఘాసంస్థకు ఈ-మెయిల్
* అప్రమత్తమైన పోలీసులు
* రాష్ట్ర కార్యాలయం వద్ద పటిష్ఠ భద్రత
* కిషన్‌రెడ్డికి వ్యక్తిగత భద్రత పెంపు

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారతీయ జనతాపార్టీ(భాజపా) రాష్ట్ర కార్యాలయాన్ని పేల్చేస్తామంటూ లష్కరేతోయిబా హెచ్చరిస్తూ నిఘా సంస్థ(ఐబీ)కి ఈ-మెయిల్ చేసింది. వెంటనే ఐబీ అధికారులు నగర పోలీసులను, ఇంటెలిజెన్స్ విభాగాన్ని హెచ్చరించారు. దీంతో రాష్ట్ర నిఘావర్గాలు, హైదరా బాద్ నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. నాంపల్లి గాంధీభవన్ రోడ్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికలకు ముందు కూడా లష్కరేతోయిబా నుంచి ఇలాంటి ఈ-మెయిళ్లు వచ్చిన విషయం తెలిసిందే.

### ముమ్మర తనిఖీలు

హెచ్చరికలు అందగానే నగర పోలీసులు, నగర భద్రతా విభాగం(సీఎస్‌డబ్ల్యూ) పరిధిలోని బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లు భాజపా రాష్ట్ర కార్యాలయంలో ముమ్మర తనిఖీలు నిర్వహించాయి. కార్యా లయం వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. లష్కరేతోయిబా ఈ-మెయిల్‌లో ప్రత్యేకించి హైద రాబాద్‌ను పేర్కొనడంతో పోలీసులు భాజపా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి భద్రతపైనా దృష్టి సారించారు. ఇప్పటి వరకు కిషన్‌రెడ్డికి వ్యక్తిగత భద్రత 2+2గా ఉంది. దాన్ని శనివారం 3+3గా చేశారు. మరో వైపు కిషన్‌రెడ్డి నివాసం వద్ద కూడా పికెట్ పెంచారు. బర్కత్‌పురలోని ఆయన ఉండే అపార్ట్‌మెం ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. 'లష్కరే తోయిబా నుంచి గతంలోనూ ఇలాంటి హెచ్చరికలు వచ్చాయి. నిఘావర్గాల హెచ్చరికలతో భాజపా కార్యాలయం వద్ద భద్రతను పెంచుతున్నాం' అని నగర పోలీసు కమిషనర్ బి.ప్రసాదరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 'పోలీసులకు ఈ-మెయిల్ వచ్చిన విషయం వాస్తవమే. భాజపా కార్యాలయంతోపాటు నాకూ వ్యక్తిగత భద్రతను పెంచారు' అని భాజపా ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి వివరించారు.

---

## రాష్ట్రంలో ఏడు బీసీ సర్కిళ్లు

* బాధ్యతల స్వీకరణ అనంతరం మంత్రి ముఖేష్ వెల్లడి

న్యూస్‌టుడే-గౌలిగూడ: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ముఖేష్‌గౌడ్... తన తొలి సంతకాన్ని రాష్ట్రంలో రూ.1.48 కోట్లతో నిర్మించనున్న ఏడు బీసీ స్టడీ సర్కిళ్ల ఫైలుపై చేశారు. సచివాలయంలోని'ఎ' బ్లాకులో వేద పండితుల ఆశీర్వచనాలతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, తిరుపతి, కడప, విజయ నగరం జిల్లాల్లో కొత్తగా ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసే ఏడు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా... పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో మేలు జరుగుతుందని ముఖేష్ అన్నారు. 2008-09 ఆర్థిక సంవత్సరంలో బీసీల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లకు పైగా బడ్జెట్ కేటాయింపులు జరిపి, వెనుకబడిన కులాల సమగ్రాభివృద్ధికి కృషి చేసినట్లు మంత్రి తెలిపారు. బీసీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. చేతివృత్తులపై ఆధారపడిన కమ్మరి, విశ్వబ్రహ్మణ కులాల అభివృద్ధికి ప్రత్యేక సమాఖ్యలను ఏర్పాటు చేసినట్లు ముఖేష్‌గౌడ్ వివరించారు. ముఖేష్ పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమానికి మంత్రి దానం నాగేం దర్, ఎంపీ అంజన్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు అంజయ్య, ఎమ్మెల్యేలు ఆకుల రాజేందర్, మర్రి శశిధర్‌రెడ్డి, మణెమ్మ, జయసుధ, విష్ణువర్దన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, రాజిరెడ్డి, సుధీర్‌రెడ్డి, భిక్షపతియా

దవ్ తదితరులు హాజరయ్యారు.

## నల్లజాతీయుల చైతన్య స్ఫూర్తి శ్రీవర్షిణి

* 'పీపుల్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ప్రదానం

* విదేశాల్లో నగర విద్యార్థిని ప్రతిభ

న్యూస్‌టుడే-హైదరాబాద్: చదువు కొనసాగిస్తూనే సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుని విదేశాల్లో సైతం శెభాష్ అనిపించుకుంది నగరానికి చెందిన శ్రీవర్షిణి. నల్ల జాతీయుల్లో తెచ్చిన చైతన్యం ఆమెకు ఆ దేశ అత్యున్నత పురస్కారం లభించేలా చేసింది. నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన శ్రీవర్షిణి పెన్సిల్వేనియాలోని ఇండియానా యూనివర్శిటీలో ఎం.బి.ఎ. చదువుతోంది. ఇదే యూనివర్శిటీలో ఉన్న ది ఆఫ్రికన్ అమెరికన్ కల్చరల్ సెంటర్ విభాగం నుంచి ఈ ఏడాది ఏప్రిల్‌లో పీపుల్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో పాటు సర్టిఫికేట్ ఆఫ్ అప్రిసియేషన్, డైరెక్టర్ అవుట్ స్టాండింగ్ అవార్డులను సొంతం చేసుకుంది. ఎం.బి.ఎ. చదువుతూనే యూనివర్శిటీలో ప్రోగ్రాం ప్లానర్, వెబ్‌సైట్ మెయింటెనెన్స్, ఈవెంట్ ప్లానర్ పనిచేస్తున్న శ్రీవర్షిణి తన అనుభవాలను 'న్యూస్‌టుడే'తో పంచుకుంది. ఆమె మాటల్లోనే...

### ఇంజినీరింగ్ నుంచి... మేనేజ్‌మెంట్ వైపు

"నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న అనూరాధరాజు, దశరథ రాజు నా తల్లిదండ్రులు. గుంటూరు జిల్లా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్. కంప్యూటర్స్ చేశా. ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేదాన్ని. అమ్మ న్యాయవాది. లయన్స్‌క్లబ్ సభ్యురాలు. ఆమెతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనే దాన్ని. ఇంజినీరింగ్ పూర్తయిన తరువాత మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకున్నా. అమ్మానాన్నలు అంగీకరించటంతో అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఎం.బి.ఎ. చదవడానికి వెళ్లా.

### ఆఫ్రికన్లకు అపన్న హస్తం

ఉదయం 8గంటలకే కళాశాలకు వెళ్లేదాన్ని. క్లాసులు అయిపోయిన తరువాత లభించే ఖాళీ సమయం బోర్‌గా అనిపించేది. దీంతో యూనివర్శిటీలోనే ఉన్న 'ది ఆఫ్రికన్ అమెరికన్ కల్చరల్ సెంటర్'లో వెబ్‌సైట్ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నా. ఇది పూర్తిగా అమెరికాలోని నల్లజాతీయుల కోసం పనిచేసే సాంస్కృతిక విభాగం. ఆఫ్రికన్ల అభ్యున్నతి కోసం ఇందులో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతారు. ఇక్కడ ఆఫ్రికన్లను చూసి నాకు చాలా జాలేసింది. ఆఫ్రికన్లు సహజంగానే మనకంటే విభిన్నంగా ఉంటారు. మనతో కలుపుగోలుగా ఉండటానికి వెనకాడుతారు. భారతీయులంటే వారికి ఓ రకమైన భావన మొదట్లో ఉండేది. వారిలో మార్పు తీసుకురావాలని ఎంతో ప్రయత్నించినా మనతో కలిసిపోరు. ఇక్కడ నివసించే ఆఫ్రికన్లకు, అమెరికన్లకూ చాలా తేడా ఉంది. మార్టిన్ లూథరిన్ ఆఫ్రికన్లకు సమాన హక్కులు సాధించినా... సరైన దిశా నిర్దేశం చేసేవారు లేక పక్కదారి పడుతున్నారు.

### అందుకే అవార్డులు...

ఆఫ్రికన్లు నిరక్షరాస్యత, చిన్నవయసులోనే మాదకద్రవ్యాలకు అలవాటు పడటం, చట్టవ్యతిరేక గర్భవిచ్ఛిత్తి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వాటిపై వారిలో అవగాహన కల్పించడానికి నిపుణులతో సలహాలు , సూచనలు ఇప్పించడం, వ్యక్తిత్వ వికాసం తరగతులు నిర్వహించడం, టైం మేనేజ్‌మెంట్, ఒత్తిడి నుంచి రిలీఫ్, ఇతరులకు సహాయం చేయడం తదితర వాటిలో శిక్షణ ఇచ్చాం. బ్రెజిల్, చైనా, కెన్యా, గానాలకు చెందిన నలుగురు ఎం.బి.ఎ. విద్యార్థుల సహకారంతో ఈ కార్యక్రమాలను చేపట్టాం. ఇక్కడి ఆఫ్రికన్ల కుటుంబ పరిస్థితులు మనదేశంలోని మురికివాడల ప్రజలను తలపిస్తాయి. ఆ వాతావరణం నుంచి వారిని బయటపడేసి చైతన్యం తీసుకు వచ్చాం. తోటివారికి సహాయపడాలనే తపనే వారికి స్నేహ హస్తం అందించేలా చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇందుకు గాను పెన్సిల్వేనియా ప్రభుత్వం నాకు 'పీపుల్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ఇచ్చి సత్కరించింది. వీటితో మరో రెండు అవార్డులు వచ్చాయని ఆమె తెలిపారు.

అందరికంటే భిన్నంగా...

న్యూయార్క్, న్యూజెర్సీలలో భారతీయ విద్యార్థులు సెలవురోజుల్లో సరదాగా గడుపుతుంటారు. మేం మాత్రం సరికొత్తగా సెలవులను ఎంజాయ్ చేసేవాళ్లం. మా బృందం ఒక మ్యూజియానికో లేక సంస్కృతిని ప్రతిబింబించే ప్రాంతాలకో వెళ్లి వాటి వివరాలు తెలుసుకునే వాళ్లం. అమెరికన్లు, ఆఫ్రికన్ల మధ్య గ్యాంగ్ వార్, గన్‌కల్చర్ కారణంగా వారిలో అక్షరజ్ఞానం కరువైంది. దీనిని గుర్తించి వారిలో మార్పు తీసుకురావాలనుకున్నాం. వారికి వర్క్‌షాపులు, సదస్సులు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకువచ్చాం. మురికివాడల్లో నివసించే వారికి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాం. బాలకార్మికుల విముక్తి కోసం తల్లిదండ్రులతో సదస్సులు ఏర్పాటు చేశాం. వీటన్నింటినీ గుర్తించి యునివర్శిటీ యాజమాన్యం మాకు ప్రత్యేక గౌరవం ఇచ్చేది.

ప్రోగ్రాం ప్లానర్‌గా...

యూనివర్శిటీలో చదువుతూనే... వెబ్‌సైట్ నిర్వహణలోనూ, ప్రోగ్రాం ప్లానర్‌గా.. ఈవెంట్ ప్లానర్‌గా కళాశాల యాజమాన్యానికి సహకరించేదాన్ని. నన్ను అక్కడ ఎవరూ పరదేశీయురాలిగా చూడలేదు. ఎందుకంటే నేను వారిలో ఒకరిగా కలిసిపోయేదాన్ని. నేను ఏది చెప్పినా దాన్ని ఆచరణలో పెట్టడానికి స్నేహితులు సుముఖత చూపేవారు. విద్యార్థులు, యాజమాన్యం దృష్టిలో నాకంటూ ప్రత్యేకత ఉండేది. చిన్నతనం నుంచే నా బర్త్‌డేని వైవిధ్యంగా జరుపుకోవడానికి ఇష్టపడేదాన్ని. నా ఆలోచనలు ఇతరులకన్నా భిన్నంగా ఉండేవి. బర్త్‌డే సందర్భంగా మదర్‌థెరిసా ఆశ్రమం, రామకృష్ణ మఠం వంటి ప్రాంతాలకు వెళ్లేదాన్ని. నన్ను అందరూ ఎగతాళి చేసినా పట్టించుకోనేదాన్ని కాదు."

---

## అనాథల ఆశాదీపం విక్టోరియా హోం

*పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు

న్యూస్‌టుడే, ఎల్.బి.నగర్: ఏ ఆధారం లేని చిన్నారులకు ఆశాదీపమైంది ఎల్.బి.నగర్‌లోని విక్టోరియా హోం. అనాథలుగా అక్కడకు చేరిన బాలలు చదువుల్లో చక్కగా రాణిస్తున్నారు. ప్రతిభలో తామెవరికీ తీసిపోమని నిరూపిస్తున్నారు. ఇటీవలి పదోతరగతి ఫలితాలు ఇదే విషయాన్ని వెల్లడించాయి.

నిజాం-6 మీర్ మహబూబ్ అలీఖాన్ స్థాపించిన అనాథ శరణాలయం కాలక్రమేణా విక్టోరియా హోం మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్‌గా మారింది. ఎంతో మంది అనాథల భవితకు బాటలు వేస్తోంది. ఉపాధ్యాయులే తల్లిదండ్రులుగా ఆదరాభిమానాలు అందిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధీనంలోని పాఠశాలల్లో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించారు. 94% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 58మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 37మంది ప్రథమ శ్రేణి, 14 మంది ద్వితీయశ్రేణి, నలుగురు తృతీయశ్రేణిలో పాసయ్యారు. సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు.

చదువుల రాణి...లక్ష్మి (548)

గుంటూరు జిల్లా చుండూరుకు చెందిన టి.లక్ష్మికి తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి రత్నమ్మతో నగరానికి వచ్చింది. తల్లి పల్లీలు అమ్ముకుంటూ జీవిస్తోంది. లక్ష్మి హోంలో చేరి చదువులో రాణించింది. 548 మార్కులు సాధించి అందరితో శభాష్ అనిపించుకుంది. ఆటపాటల్లోనూ మేటిగా నిలిచింది. కబడ్డి పోటీలో సబ్ జూనియర్ విభాగంలో జాతీయ స్థాయిలో ఆడింది. గౌహతి, ఢిల్లీ, పాండిచ్చేరిల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. రాష్ట్ర స్థాయిలో ఎన్నో పతకాలు సంపాదించింది.

అమ్మే ఆధారం...

శారద (531) నల్గొండ జిల్లా చింతపల్లి తక్కలపల్లికి చెందిన నేనావత్ శారద బాల్యంలోనే తండ్రిని

కోల్పోయింది. చదువు మానేసే పరిస్థితిలో హోంలో చేరి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివింది. 531 మార్కులు సాధించి అందరితో శభాష్ అనిపించుకుంది. ఆమె తల్లి ఎన్టీఆ ర్‌నగర్‌లో ఉంటోంది. ఇళ్లల్లో పాచిపని చేస్తూ కడుపు నింపుకుంటోంది.

### క్రీడల్లోనూ మేటి
### హరికృష్ణ (515)

నల్గొండ జిల్లా దామెరచెర్లకు చెందిన ఆర్.హరికృష్ణకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇద్దరూ చని పోయారు. కష్టపడి చదివి 515 మార్కులు సాధించాడు. పలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు గెల్చుకున్నాడు. చదువులోనూ రాణించడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### విజయానికి కారణాలివే..

* కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విక్టోరియా హోం రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు పోటీ పడుతున్నారు.
* ఉపాధ్యాయుల అంకితభావానికి విద్యార్థుల పట్టుదల, కృషి తోడయ్యాయి.
* చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో అందరూ ఉత్తీర్ణులు కావడా నికి దోహదపడింది.

### అభినందనల వెల్లువ

రాష్ట్రంలోనే అత్యధిక ఫలితాలు సాధించిన విక్టోరియా హోం రెసిడెన్షియల్ స్కూల్‌కు గురుకుల పాఠశాలల సిబ్బంది రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.ఎస్.మూర్తి, కె.వెంకట్‌రెడ్డి, ప్రధానాచార్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.రంగారెడ్డి అభినందనలు తెలిపారు. అత్యధిక మార్కులు సాధిం చిన విద్యార్థులను ప్రిన్సిపల్ కె.కొండల్‌రెడ్డి అభినందించారు.

---

## మెట్రో రైలు... చిగురిస్తున్న ఆశలు..!

* టెండర్లా? కేంద్ర సహకారమా?
* అధికార యంత్రాంగం మల్లగుల్లాలు

న్యూస్‌టుడే, హైదరాబాద్: మళ్లీ ఆశలు చిగురించాయి. అవకాశాలు సజీవంగానే ఉన్నాయి. త్రిశం కు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్న హైదరాబాద్ మెట్రో రైలు మళ్లీ ప్రాణం పోసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సత్యం కుంభకోణం నేపథ్యంలో మెట్రో రైలుపై నీలి నీడలు కమ్ముకోగా... తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కోరితే వాటా తీసుకునేందుకు సిద్ధమని కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ప్రకటించడంతో ఆశలు మొగ్గ తొడుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి రైలు పట్టాలెలా ఎక్కు తుందనేది ఆసక్తికరంగా మారింది. పెరుగుతున్న నగర ట్రాఫిక్ దృష్ట్యా ప్రజా రవాణా వ్యవస్థ ఆవశ్యకమని నిపుణులు చెబుతున్నారు.

నగరంలోని మూడు మార్గాల్లో సుమారు 71 కిలోమీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణాన్ని రూ.12,500 కోట్లతో ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ కాంట్రాక్టును మేటాస్ కన్సార్టియం దక్కించుకుంది. సత్యం కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో మేటాస్ కన్సార్టియం ద్వారా ప్రాజె క్టును కొనసాగించటం కష్టతరమని అధికారులు మొదలు నిపుణులు వరకు అభిప్రాయపడుతు న్నారు. ప్రస్తుత మాంద్యంతో ప్రాజెక్టుకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు ఆర్థిక సంస్థలు ముందుకు వచ్చే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. ప్రజల ప్రయోజనాన్ని పరిగణలోకి తీసుకుని ఆ ఒప్పందం రద్దు చేసుకోవటమే శ్రేయస్కరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎలాంటి కోర్టు వివాదాలు లేకుండా ప్రభుత్వం ఎంత వ్యూహాత్మకంగా దీనిని నుంచి బయటపడుతుందో ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది.

## ఉన్న మార్గాలేమిటి....

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ముందు రెండు మార్గాలు ఉన్నాయి. మేటాస్ ఒప్పందాన్ని రద్దు చేసి తాజాగా మళ్లీ టెండర్లను ఆహ్వానించటం ఒకటి. కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి సూచించిన మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో ప్రాజెక్టును చేపట్టటం మరోటి. తాజాగా టెండర్లు పిలవాలంటే మళ్లీ కథ మొదటికి వచ్చినట్లే. ఈ తతంగమంతా పూర్తి చేయాలంటే ఏడాది నుంచి ఏడాదిన్నర వరకు సమయం పడుతుంది. గుత్తేదార్లు ముందుకు వస్తారా? వచ్చినా మేటాస్ ప్రతిపాదించిన రూ.30,311 కోట్లు ఇచ్చేందుకు అంగీకరిస్తారా? అనేది సందేహమే. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై తరహాలో మెట్రో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టటమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శ్రీధరన్, జైపాల్ రెడ్డి సూచించినట్లుగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో దీనిని చేపడితే ఇది పెద్దగా ఆర్థిక భారం కాబోదన్నది అంచనా. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం రుణం కాగా మిగిలిన 60శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించాలి. ఆరేడేళ్ల వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.3,600 కోట్లు భరించాలి. అంటే ఏడాదికి సుమారు రూ. 500 కోట్లు.

## మాస్ వ్యవస్థ అవసరం

ప్రస్తుతం గ్రేటర్ జనాభా దాదాపు 70లక్షల పైమాటే. వాహనాల సంఖ్య 22 లక్షల వరకు ఉంది. 2014 నాటికి జనాభా కోటిన్నరకు, వాహనాల సంఖ్య 35 లక్షలకు చేరుతుందని అంచనా. ఈ పరిస్థితుల్లో నగరానికి మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ అత్యవసరమని రవాణా రంగ నిపుణులు డాక్టర్ ఎస్.నాగభూషణరావు స్పష్టం చేశారు. శనివారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ... 'ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. నగర రోడ్లుకానీ, ప్రసుతం ఉన్న బస్సుల వ్యవస్థ కానీ ప్రజల అవసరాలను తీర్చలేవు. ప్రయివేటు సంస్థల చేతుల్లో ప్రాజెక్టును పెట్టటం కన్నా ప్రభుత్వం పర్యవేక్షణలో చేపట్టటం మంచిది. ఈ విధానం విజయవంతమవుతుందని ఢిల్లీ మెట్రో రైలు చెబుతోంది. నిధులు సమకూర్చుకోటం ప్రభుత్వానికి పెద్ద భారం కాదు' అని అన్నారు.

---

# ప్రాణాలు తీసే థ్రిల్!!

### *పొగ తాగేవాడికే కాదు
### పీల్చేవాడికీ ప్రమాదమే
### నేడే 'వరల్డ్ నో టుబాకో డే'

(న్యూస్‌టుడే, హైదరాబాద్): దమ్ము ఇచ్చే మజా... మరణానికి చేరువ చేస్తుంది. ఆకర్షణీయంగా తళుకుబెళుకులతో కనిపించే ఆ ప్యాకెట్లలో ఆయుష్షు తీసే శక్తి దాగుంటుంది. సరదా సరదా సిగిరెట్టు... ఇది దొరలు తాగు సిగిరెట్టు పాట వినేందుకు హాయిగా ఉన్నా... తొందరపడి వాటి జోలి కెళితే జీవితం నరకప్రాయమే. లావుపాటి చుట్టను నోట్లో పెట్టుకొని కౌబాయ్ ఒక్క దమ్ముతో పొగ మేఘాలు సృష్టిస్తే... పొగాకు ఉత్పత్తులతో చెలిమి చేశాక ప్రాణాలు గాల్లో కలిసే అవకాశాలే ఎక్కువ.

ఒక సిగిరెట్ ఐదు నిమిషాల ఆయుష్షును హరిస్తుంది. పొగ తాగేవాడికే కాదు... పక్కనే ఉండి పీల్చేవాడికీ ఇదే పరిస్థితి. సిగిరెట్ తాగటం వల్లే ఏటా 10లక్షల మంది దేశవ్యాప్తంగా చనిపోతున్నారు. ఈ అలవాటును మానేసిన వారిలో లంగ్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 50రెట్లు తగ్గిపోతే... అన్నవాహిక క్యాన్సర్ వచ్చే ముప్పు 30 రెట్లు తగ్గుతుంది. కాలే సిగిరెట్ చివర 160 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే... నాలుగువేల క్యాన్సర్ కారకాలు ఉంటాయి. ఇలాంటివెన్నో వాస్తవాలు రింగులు రింగులు వదులుతూ సిగిరెట్టు తాగే చాలామందికి తెలీదు. సరదాగానో... హీరోయిజంతోనో గొప్పగా కనిపించటానికో మొదలుపెట్టే ధూమపానం రోజులు గడిచే కొద్దీ దాన్ని వదల్లేని వ్యసనంగా మారి పీడిస్తుంది. ఇందులోని నికోటిన్ మెదడు మీద పని చేయటంతో దాన్ని వదల్లేని స్థితికి చేరుకుంటారు. "చాలా మంది ఆకలి కాదని, ఒత్తిడిని తగ్గించి రిలాక్స్ ఇస్తుందని భావిస్తారు. ఇది కేవలం అపోహే" అని ఛాతీ ఆసుపత్రిలో శ్వాసకోస నిపుణులు డాక్టర్ కె.శుభాకర్

పేర్కొన్నారు. ధూమపానం, పొగాకు పదార్థాలు శరీరంపై చూపించే ప్రభావమెంతో. కాలేయం, బ్లాడర్, అన్నవాహిక, తదితర భాగాలకు క్యాన్సర్ సోకుతుంది. గుండె జబ్బులు చుట్టుముడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. "ధూమపానం చేసే వారి రక్తంలోని హిమోగ్లోబిన్‌లో ఆక్సిజన్ బదులు, కార్బసీ హిమోగ్లోబిన్ ఉండటంతో రక్తనాళాలు మూసుకుపోతాయి. దీంతో రక్త ప్రసరణ తగ్గుతుంది. ఇవే కాకుండా బీపీ, శ్వాసకోస వ్యాధులు, శ్వాసకోస నాళాలు మూసుకుపోవటం జరుగుతుంది. ఇక... ఆస్మా ఉన్న వాళ్లలో పొగతాగే వారు తరచుగా అనారోగ్యానికి గురవుతుంటారు. ఈ అలవాటు వల్ల నిమోనియాతో పాటు శరీరంలోని రక్షణ వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుంది" అని శుభాకర్ చెప్పారు.

### కాలుష్యం బారిన...

కొంతకాలం క్రితం నగరంలో పోలీసులపై ఓ సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ విభాగంలో పనిచేసే పోలీసుల్లో పొగతాగేవారు, తాగని వారిని పరీక్షించినప్పుడు ధూమపానం చేసేవారిలో ఎక్కువ మంది ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నట్లు తేలింది. ట్రాఫిక్ కారణంగా ఉండే కాలుష్యంతో పాటు... పొగతాగటం వల్ల ఆరోగ్య సమస్యలు రెట్టింపు అవుతాయని వైద్యులు విశ్లేషించారు. ఇక... ఇంట్లో ధూమపానం చేసే వారివల్ల ఇంట్లోని ఇతర సభ్యుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. "ధూమపానానం అలవాటున్న గర్భిణీ లోపలి శిశువు బరువు కోల్పోతారు. పుట్టే పిల్లల్లో శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఒక్కోసారి చనిపోతారు" అని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### మానాలనుకుంటే...

ధూమపానం, పొగాకు సంబంధ పదార్థాల్ని తీసుకునే అలవాటును మానుకోవాలనుకుంటే... క్రమ పద్ధతిలో తగ్గించే ధోరణి సరికాదని నిపుణులు చెబుతున్నారు. ఏదో ఒక రోజు చూసుకొని... దృఢచిత్తంతో మానేయటమే మేలు. ఇలా మార్పు కోరుకునేవారు తప్పనిసరిగా తాము మారాలన్న దృఢచిత్తంతో ఉండాలి. దీనికి కుటుంబ సభ్యులు కూడా ప్రోత్సాహం, సహకారం అందిస్తే వారీ వ్యసనం నుంచి బయటపడే అవకాశం ఉంది. ఈ అలవాట్లను మానుకోవటం వల్ల ఆరోగ్యం పెంచుకోవటమే కాదు అనవసర ఖర్చుకు కూడా తగ్గించుకోవచ్చు. ఈ వ్యసనాల నుంచి బయట పడాలనుకుంటే నికోటిన్‌తో కూడిన చూయింగ్‌గమ్‌లు, ప్యాచెస్, స్ప్రేలు అందుబాటులోకి వచ్చాయి. తాగాలన్న కోరికను తగ్గించేందుకు మాత్రలు కూడా వచ్చాయి. వాటిని వైద్యుల సూచనలతో వాడాల్సి ఉంటుంది.

### గ్రేటర్ ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు

వరల్డ్ నో టుబాకో డే ని పురస్కరించుకొని జీహెచ్ఎంసీ ఆరోగ్య విభాగంలో ఈ అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో పొగతాగే అలవాటు ఎక్కువగా ఉంటుందని... పురుషుల్లో ఎక్కువని జీహెచ్ఎంసీ కమిషనర్ ఎస్పీ సింగ్ అన్నారు. సామాజికంగా తోడ్పాటు అందకపోవటం వల్లే బహిరంగ ప్రదేశాల్లో పొగతాగే వారిపై చర్యలు తీసుకునే చట్టం సమర్థంగా అమలు జరగటం లేదన్నారు. పొగాకు సంబంధమైన వస్తువుల్ని పిల్లలకు అమ్మకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధూమపానంపై అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది "పొగాకు- ఆరోగ్య హెచ్చరికలు' అన్న నినాదంతో ప్రచారం చేస్తుందని ఛాతీ ఆసుపత్రి సూపరింటెంట్ ఎన్.వి.ప్రసాద్ తెలిపారు. 'పొగాకు థ్రిల్‌ని ఇవ్వటమే కాదు... చంపుతుంది కూడా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జీహెచ్ఎంసీ అధికారులు, ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.

---

## ఆర్పీఎఫ్ సేవలు అభినందనీయం: జీఎం

సికింద్రాబాద్, మే 30 (న్యూస్‌టుడే): భద్రతా పరంగానే కాకుండా ఎన్నికల విధుల్లోనూ దక్షిణ మధ్య రైల్వేకు చెందిన రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) అందించిన సేవలు అభినందనీయమని జనరల్ మేనేజర్ హెచ్.కె.పథీ అన్నారు. జీఎం పదవీ విరమణను పురస్కరించుకుని ఆర్పీ

ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించి గౌరవ వందనంతో అధికారికంగా వీడ్కోలు పలికాయి. శని వారం ఉదయం మౌలాలీలోని ఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీఎం పధీ ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రయాణికుల భద్రత, నేరాల అదుపునకు చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారా ఆర్పీఎఫ్‌కు మంచి పేరు తేవాలని సూచించారు. ఉత్తమ సేవలను అందించిన ఆర్పీఎఫ్ దళానికి రూ.25 వేల పారితోషికాన్ని జీఎం ప్రకటించారు. రైల్వే ప్రధాన భద్రతాధికారి ఆర్.ఎన్.సక్సేనా మాట్లాడుతూ ఆర్పీఎఫ్ కార్యకలాపాలను విస్తరింపజేయడంలో జీఎం సహకారం మరువలేనిదన్నారు. ఉప ప్రధాన భద్రతాధికారి సిన్హా, ఆర్పీఎఫ్ శిక్షణ కేంద్ర ప్రిన్సిపల్ రామకృష్ణ లతో పాటు పలువురు సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

---

## బలాబలాల బేరీజు!

* పట్టు పెంచుకోనున్న మజ్లిస్
* గ్రేటర్ పీఠంపై మజ్లిస్-కాంగ్రెస్ కన్ను
* అన్ని పార్టీల్లో లోక్‌సత్తా భయం

న్యూస్‌టుడే, హైదరాబాద్: గ్రేటర్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించటం తో రాజకీయ పార్టీలు బలాబలాలపై బేరీజు వేసుకుంటున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనతో నగరంలో మజ్లిస్ బలం గణనీయంగా పెరిగింది. తొమ్మిది నియోజకవర్గాల్లో ఈ పార్టీ ఓటర్ల సం ఖ్య అధికంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-మజ్లిస్ పార్టీల మధ్య నెలకొన్న రాజకీయ అవ గాహన గ్రేటర్ ఎన్నికల పోరులోనూ కొనసాగనుంది.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్, మజ్లిస్ నాయకులు వ్యూహరచనల్లో ఉన్నారు. ఎన్నికల్లో గెలుపు నల్లేరుపై నడకేనని ఈ రెండు పార్టీల నాయకులు భావిస్తున్నారు. శివారు మున్సిపాలిటీల విలీనం నేపథ్యంలో గ్రేటర్ మున్సిపల్ కార్పొరే షన్‌ను 150 వార్డులుగా విభజించారు. కనీసం 100 వార్డులను గెలుచుకుంటామని రెండు పార్టీల నాయకులు చెబుతున్నారు. వారి అంచనాల్లో కొంతమేరకు వాస్తవం లేకపోలేదు. గ్రేటర్ పరిధిలో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే వాటిలో కాంగ్రెస్- మజ్లిస్ పార్టీలు 20 స్థానాలను దక్కించు కున్నాయి. 13 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా మజ్లిస్ ఏడు నియోజకవర్గాల్లో గెలుపొందింది. తెలుగుదేశం, భాజపా, లోక్‌సత్తా, కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి ఒక్కో స్థానాన్ని దక్కించుకు న్నారు. 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, మజ్లిస్ ప్రాతినిధ్యం వహిస్తున్న 20 స్థానాల్లో 125 వార్డులు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థి ప్రాతినిధ్యం వహిస్తున్న కుత్బుల్లాపూర్‌లో ఏడు వార్డులున్నాయి. ప్రతిపక్షాల చేతుల్లో ఉన్న అంబర్‌పేట, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి నియోజ కవర్గాల్లో 18 వార్డులు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల సరళి నేపథ్యంలో అన్ని పార్టీల్లో లోక్ సత్తా ప్రభావంపై ఆందోళన నెలకొంది.

### తెదేపాకు సవాలు

అసెంబ్లీ ఎన్నికల్లో హించని రీతిలో ప్రత్యేకించి గ్రేటర్ పరిధిలో తెలుగుదేశం చేదు అనుభవాన్ని చవిచూసింది. ఆ అనుభవం నుంచి తేరుకోక మునుపే గ్రేటర్ ఎన్నికలు రానుండటంతో ఆ పార్టీ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. 2002లో జరిగిన ఎన్నికల్లో 22 మంది కార్పొరేటర్లతో పాటు మేయర్ స్థానాన్ని తెలుగుదేశం గెలుచుకుంది. ప్రస్తుతం గ్రేటర్ మొత్తం మీద ఒకే ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఆ పార్టీ గెలుపొందింది. ఈ నేపథ్యంలో మునుపటి స్థానాలను దక్కించుకునేం దుకు కృషి చేయాలని పార్టీ వర్గాలు సమాయత్తమవుతున్నాయి. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దీటుగా సమాధానం చెప్పేందుకు తాము సన్నద్ధమవుతున్నామని తెలుగుదేశం నగర మాజీ అధ్య క్షుడు జి.సాయన్న 'న్యూస్‌టుడే'తో చెప్పారు.

### భాజపాకు మళ్లీ అన్నీ దక్కేనా...

మునుపటి మున్సిపల్ కార్పొరేషన్‌లో భాజపాకు 16 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఈ దఫా ఎన్ని స్థానాలు సాధించుకుంటుందన్నది ఆసక్తికర పరిణామమే. గ్రేటర్ ఏర్పాటుకు మునుపు కార్పొరేషన్

పరిధిలో ఉన్న వంద వార్డుల్లో పెద్దమనుషుల ఒప్పందం (జెంటిల్మెన్ అగ్రిమెంట్) ప్రకారం సికింద్రాబాద్ ప్రాంతానికి 20 వార్డులను ప్రత్యేకించారు. విలీనం నేపథ్యంలో ఆ ఒప్పందం రద్దు అయింది. పునర్విభజనతో సికింద్రాబాద్ ప్రాంతంలో 11 వార్డులు మాత్రమే ఉండటం విశేషం. గతంలో భాజపా గెలుచుకున్న 16 స్థానాల్లో సింహభాగం సికింద్రాబాద్ ప్రాంతానికి చెందినవే. తెలుగుదేశం, భాజపాల మధ్య అప్పట్లో సీట్ల సర్దుబాటు జరిగింది. తెలుగుదేశం మద్దతుతో భాజపా డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకుంది.

### లోక్‌సత్తా ప్రభావంపై చర్చ

గ్రేటర్ ఎన్నికల్లో లోక్‌సత్తా ఇతర పార్టీల విజయావకాశాలను ఎంతమేరకు దెబ్బతీస్తుందో అన్నది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికల్లో లోక్‌సత్తా కూడా తన సత్తాను చాటుకునే అవకాశం లేకపోలేదు. ఉన్నది ఒకే ఒక్క అసెంబ్లీ నియోజకవర్గమే అయినప్పటికీ నగరంలో ఆ పార్టీ వేళ్లూనుకుంటోంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో ఆ పార్టీ కొంత మేరకు ఓటు బ్యాంకును సాధించుకోగలిగింది. గ్రేటర్ పరిధిలోని 20 నియోజకవర్గాల్లో పోటీ చేసిన ఆ పార్టీ కూకట్‌పల్లిలో గెలుపొందింది. మరో తొమ్మిది స్థానాల్లో పది వేల నుంచి 28 వేల వరకు ఓట్లను ఒక్కో నియోజకవర్గంలో సాధించుకోగలిగింది. మరో ఆరు నియోజకవర్గాల్లో అయిదు వేల నుంచి పది వేల లోపు ఓట్లను సాధించింది. ఈ నేపథ్యంలో లోక్‌సత్తా భయం పలు పార్టీల్లో నెలకొందనటంలో సందేహం లేదు.

---

## చికాగో తెలుగు అసోసియేషన్ ఆవిర్భావం

* జూలైలో వేడుకలు

ఖైరతాబాద్, మే 30 (న్యూస్‌టుడే): ఎన్నారైలతో మరో తెలుగు సంఘం ఉద్భవించింది. మూడు నెలల కిందట ఆవిర్భవించిన చికాగో తెలుగు అసోసియేషన్ ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ వివరాలను అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు ఆచంట రవి, శివచౌదరి బాబు, రమేష్ శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో వివరించారు. సాటి తెలుగు వారికి స్నేహ హస్తం అందించాలనే దృక్పథంతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. అమెరికాలో తెలుగు వారిపై జరిగిన విషాద ఘటనల్లో వారిని ఆదుకోవడంలో సంఘం ముందుందన్నారు. అలాగే ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొనేందుకు తగిన శిక్షణ, ఆరోగ్యం కోసం యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో జూలై 2, 3 తేదీల్లో అక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, అందులో సినీ ప్రముఖులు, ఆధ్యాత్మిక గురువులు, సాంస్కృతిక ప్రముఖులు పాల్గొంటున్నారని వివరించారు. అదే సమయంలో చికాగో తెలుగు అసోసియేషన్ ప్రతిష్ఠాత్మకంగా ఇస్తున్న లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంటు అవార్డులను డిప్యూటీ స్పీకర్ నాదేండ్ల మనోహర్, సూపర్‌స్టార్ కృష్ణ, విసు ఛైర్మన్ పి.సి.రెడ్డి, గిన్నిస్ బుక్ హోల్డర్ గజల్ శ్రీనివాస్‌లకు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఉత్సవాల సందర్భంగా సాహితీ సదస్సులు, లేపాక్షి, కొండపల్లి లాంటి సంప్రదాయ కళాకృతులతో ప్రదర్శన, చికాగోలో నివసిస్తున్న బాలబాలికలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. విలేకర్ల సమావేశంలో గజల్ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

---

## స్వైన్‌ఫ్లూ పేరుతో పందులు అమ్ముకున్నారు!!

* మున్సిపల్ సిబ్బందిపై బాధితుడి ఫిర్యాదు

ఎల్.బి.నగర్, మే 30 (న్యూస్‌టుడే): ప్రపంచాన్ని గడగడలాడించిన స్వైన్ ఫ్లూ నగరంలో సరికొత్త వివాదానికి తావిచ్చింది. ఇటీవల మున్సిపాలిటీ సిబ్బంది స్వైన్ ఫ్లూ భయంతో నగరంలో పందుల పట్టుకొని దూరంగా తరలిస్తున్నారు. చాలావాటిని చంపేస్తున్నారు. అయితే ఇందులో కూడా అధికారులు చేతివాటం చూపారని ఫిర్యాదు వచ్చింది. పట్టుకున్న పందులను మాంసం విక్రయదారులకు అమ్ముకున్న సంఘటన ఎల్.బి.నగర్ సర్కిల్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. మన్సూరాబాద్ శ్రీరాంనగర్‌లో హనుమంతు అంజయ్య పందుల పెంపకందారుడు. స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది ఆదివారం 50 పందులను పట్టుకున్నారు. ఈ క్రమంలో అంజయ్యకు సిబ్బం

దికి మధ్య గొడవ జరిగింది. బాధితులు గగ్గోలు పెట్టినా పందులను పట్టుకెళ్లిపోయారు. ఐతే అవే పందులు సైదాబాద్ సింగరేణికాలనీలో కనపడ్డాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితం కావడంతో పట్టుకున్న పందులను అమ్ముకున్నారని స్పష్టమవుతోంది. వీటిని నగరానికి 4 నుంచి 5 కి.మీ. దూరానికి తరలించి రావాలి. దాంతో బాధితుడు అంజయ్య తన పందులను పట్టుకెళ్లి సైదాబాద్‌లోని మాంసం విక్రేతకు ఒక్కొక్కటి రూ.3 వేలకు అమ్మారని శనివారం ఉపకమిషనర్ పి.నాగవేణికి ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయం జరగకపోతే ఈ విషయాన్ని హోంమంత్రి వరకు తీసుకెళ్తానని అంజయ్య 'న్యూస్‌టుడే'కు చెప్పారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్య తీసుకుంటానని ఉపకమిషనర్ నాగవేణి హామీ ఇచ్చారు.

**విచారణ చేస్తున్నాం: పశువైద్యాధికారి**

తనకు విషయం తెలిసిందని, తమ ఏడీ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని మున్సిపల్ పశువైద్యాధికారి రామకృష్ణ వివరణ ఇచ్చారు. పందులను అమ్ముకున్నారన్న విషయం రుజువైతే ఆదివారం పందులను తరలించిన వాహనం డ్రైవర్ బాబూరావును సస్పెండ్ చేస్తామన్నారు. మిగతా వారంతా కార్మికులని తెలిపారు.

---

## పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి

* వైద్యారోగ్య శాఖ మంత్రి దానం నాగేందర్

నాంపల్లి, మే 30 (న్యూస్‌టుడే): ధూమపానం, పొగాకు సంబంధిత ఉత్పత్తులకు అలవాటు కావడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక, సామాజిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దానం నాగేందర్ అన్నారు. పొగాకు ఉత్పత్తులకు పౌరులు దూరంగా ఉండాలని సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సిటిజన్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన పొగాకు వ్యతిరేక పోస్టర్లను శనివారం దానం నాగేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగడం వల్ల ఏటా లక్షలాది మంది క్యాన్సర్, గుండె, పిరితిత్తులకు సంబంధించి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ సిగరెట్ తాగి వదిలే పొగలో 4 వేల రకాల రసాయనాలుంటాయని, ధూమపానం వల్ల నపుంసకత్వంతో పాటు అనే రుగ్మతలు వస్తాయన్నారు. ప్రపంచంలోని నోటి క్యాన్సర్ బాధితుల్లో 90 శాతం మంది భారతీయులేనని వాపోయారు. 'సాపిడ్' స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ మీరాఖదీర్ మాట్లాడుతూ ధూమపానం వల్ల మానసిక ఆందోళన, ఆతృత, ఏ పని మీద ఏకాగ్రత చూపించకపోవడం వంటి సమస్యలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ పుప్పాల అనిల్‌కుమార్, కాంగ్రెస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్‌ముదిరాజ్, ఆంధ్రప్రదేశ్ సోషల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్‌రావు, సహకార్ సంస్థ కార్యదర్శి లలిత్‌బోరా, మహ్మద్‌సలీం, జె.రామరాజు, ఉస్మానియా ఆర్.ఎం.ఓ డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

## చెడిపోయిన లిఫ్టులోంచి మంటలు

* ఉస్మానియా ఆసుపత్రి పాతభవనంలో కలకలం

* పరుగులు తీసిన రోగులు, సహాయకులు

అఫ్జల్‌గంజ్, మే 30 (న్యూస్‌టుడే): ఉస్మానియా ఆసుపత్రిలోని పాత భవనంలో మరమ్మతులకు గుర్రై నిలిచిపోయిన లిఫ్టులోంచి... శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించింది. అగ్నిప్రమాదం సంభవించిందన్న విషయం తెలుసుకున్న వార్డుల్లోని రోగులు, ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అసహాయులైన వారిని బంధువులు భుజాలపై ఎత్తుకెళ్లారు.

ఉస్మానియా ఆసుపత్రిలోని ఎంఎం-1 వార్డులో ఉన్న లిఫ్టు మరమ్మతులకు గురైంది. మొదటి అంతస్థు, గ్రౌండ్‌ఫ్లోర్‌కు మధ్య నిలిచిపోయింది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో లిఫ్టులోంచి మంటలు ఎగిసాయి. దట్టమైన పొగ వ్యాపించింది. అగ్నిప్రమాద విషయం తెలుసుకున్న మొదటి అంతస్థులోని ఎంఎస్-4, రెండో అంతస్థులోని వార్డులు, ఎంఎం-1 వార్డుల్లోని రోగులను, వారి బంధువుల మంచాలపైనే బయటకు తీసుకెళ్లారు. ఎలక్ట్రీషియన్లు బి.రవి, శ్రీనివాస్, మహమూద్, బాల్‌రాజ్, లిఫ్టు ఆపరేటర్లు సాయి, రవి, మరికొందరితో కలిసి... బకెట్లలో నీటిని తీసుకొచ్చి మంటలను ఆర్పి వేశారు. కొద్ది సేపటి తర్వాత వచ్చిన గౌలిగూడ అగ్నిమాపక దళం మంటలను పూర్తిగా చల్లార్చింది. ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వి.అశోక్‌కుమార్, ఆర్ఎంఓ-1 డా.సుధారాణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.శ్రీనివాసరావు, ఇతర అధికారులు సంఘటనా స్థలాన్ని పర్యవేక్షించారు.

### సిగరెట్‌ను పడేయడమే కారణమా?

పాత కాలం నాటి లిఫ్టు ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉండటంతో... అందులో చెత్త, ఇతర వ్యర్థాలను పడేశారు. రోగి సహాయకుడెవరో కాలుతున్న సిగరెట్ ముక్కను లిఫ్టులో పడేయడం వల్లే అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని ఉస్మానియా అధికారులు భావిస్తున్నారు. చెక్క, ఇతర పదార్థాలతో లిఫ్టు తయారు చేసినది కావడం... చెత్త నిల్వ ఉండటంతో తొందరగా అగ్నికీలలు వ్యాపించినట్లు పేర్కొంటున్నారు. లిఫ్టుకు విద్యుత్ సరఫరా నిలిపివేసినందున విద్యుదాఘాతం జరిగే అవకాశమేలేదని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అగ్నిప్రమాదం ఘటనతో ఆసుపత్రిలోని ఎంఎం-1, ఎంఎం-3, ఎంఎస్-4 వార్డులు, సూపరింటెండెంట్ కార్యాలయ పేషీలో విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో రోగులు అవస్థలపాలయ్యారు.

### రూ.కోటితో విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ

విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణకు విద్యుత్ శాఖ నుంచి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, నెల రోజుల్లో పనులను ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ డా. వి.అశోక్‌కుమార్ తెలియపారు. ఫైర్ ఎస్టింగేర్స్‌ను వార్డుల వారీగా సమకూర్చనున్నట్లు చెప్పారు. లిఫ్టుల వద్ద చెత్త, వ్యర్థాలను నిల్వ చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

---

## శివార్లకు సరఫరా మావల్ల కాదు..!

* చేతులెత్తేసిన జలమండలి
* మరో ఏడాది గడువు కోరిన అధికారులు
* 'గ్రేటర్' ఎన్నికలకు ముందు సర్కారుకు జల పరీక్ష

(న్యూస్‌టుడే-హైదరాబాద్): త్వరలో గ్రేటర్ ఎన్నికలు జరగనున్న సమయంలో రాష్ట్ర సర్కారుకు సరికొత్త సవాలు ఎదురైంది. రోజూ నీటి సరఫరాతో ఓట్లు కొట్టేయచ్చని సంబరపడుతున్న అధికార పార్టీ నేతలకు జలమండలి షాక్ ఇచ్చింది. కీలకమైన శివారు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా మావల్ల కాదంటూ అధికారులు చేతులెత్తేశారు. శివారు ప్రాంతాలను జలమండలిలో విలీనానికి ఆదివారంతో ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియనున్నందున యంత్రాంగంలో ఆందోళన మొదలైంది. ప్రస్తుతానికి గట్టెక్కేందుకు అధికారులు ప్రభుత్వానికి ఓ లేఖ సంధించారు. గడువును మరో ఏడాది పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా అందులో కోరారు. దీంతో ఇప్పుడప్పుడే తాగునీరందే అవకాశం లేక శివారు ప్రాంత ప్రజలకు నిరాశే మిగలనుంది.

కృష్ణా రెండో దశ ద్వారా నీటి లభ్యత భారీస్థాయికి చేరుకున్న తరుణంలో ఒక్కొక్కటిగా బోర్డు నెత్తిన భారం ఎక్కువైంది. ముఖ్యంగా రోజూ నీళ్లతో 50 శాతానికి పైగా నీళ్లు ప్రధాన నగరానికే సరిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపార రంగానికి నీటి కేటాయింపును కుదించిన అధికారులు శివారు ప్రాంతాలకు 100 ఎంజీడీలను సరఫరా చేస్తున్నారు. అయితే గ్రేటర్ ఏర్పాటు దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం శివారు ప్రాంతాలను కూడా బోర్డులో విలీనం చేసుకోవాల్సిందిగా ఆదేశించింది. ఉన్నపళంగా సరఫరా విస్తరించడం సాధ్యం కాదన్న అధికారులు గడువు కోరారు. దీంతో రాష్ట్ర

ప్రభుత్వం 2009 మే 31 వరకు గడువును విధించింది. ఈలోగా అన్ని రకాల ఏర్పాట్లు ముగించు కొని సన్నద్ధం కావాలని సూచించింది. ఈ క్రమంలో ఆదివారంతో ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్త యింది.

### గతంలోనే విలీన కసరత్తు

శివారు ప్రాంతాల విలీనం కోసం జలమండలి గతంలోనే ప్రాథమికంగా కసరత్తు నిర్వహించింది. ఇందులో భాగంగా దాదాపు ఐదారు సంవత్సరాల కిందట ఎల్బీనగర్, గడ్డిఅన్నారం, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు సరఫరాను విస్తరించింది. ఒకవిధంగా బోర్డు చొరవ తీసుకొని అక్కడ పైపులైను వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఎల్బీనగర్, గడ్డిఅన్నారం ప్రాంతాలు సరఫరాకు నోచుకు న్నాయి. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిల్లో మాత్రం నేటికీ అరకొర సరఫరాతో జనం అల్లాడుతున్నారు. అయితే గడువు సమీపిస్తుండటంతో గత ఆరేడు నెలలుగా బోర్డు అధికారులు మరో అడుగు ముం దుకేశారు. మిగిలిన ఎనిమిది సర్కిళ్ల (మున్సిపాలిటీలు)ను డివిజన్లుగా గుర్తించి బోర్డు అధికారు లను కేటాయించారు. కాని అధికారికంగా మాత్రం విలీనం చేసుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికీ వాటికి బల్క్ పద్ధతిలోనే మంచినీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవంగా ఆదివారం నుంచి అధికా రికంగా ఆ ప్రాంతాలన్నీ బోర్డులో విలీనం కావాల్సి ఉంది.

### అధికారుల ముందుజాగ్రత్త...

రానున్న గ్రేటర్ ఎన్నికల్లో శివారు ప్రాంతాలు రాజకీయంగా కీలకం కానున్నాయి. కాని అలాంటి ప్రాంతాల్లోనే మంచినీటి సమస్య విలయతాండవం చేస్తున్నది. ఒకవిధంగా ఇది అధికార కాంగ్రె స్‌కు పెద్ద సవాలుగా మారనుంది. అయితే కొన్నిరోజులకైనా పరిస్థితి కుదుటపడదా...అని పార్టీ నాయకులు ఎదురుచూస్తున్నారు. గడువులోగా బోర్డు ఆ ప్రాంతాల్లో సరఫరాను తన ఆజమాయిషీ లోకి తెచ్చుకుంటుంది కదా... అని ప్రభుత్వం కూడా వేచి ఉంది. కాని మూడు సంవత్సరాల వరకు కొత్త నీటి వనరులేని పరిస్థితుల్లో శివారుకు న్యాయం చేయడం అసాధ్యమనేది అధికారుల అభిప్రాయం. అందుకే ముందున్న విషమ పరిస్థితిని గుర్తించి జాగ్రత్తపడ్డారు. సరఫరా వ్యవస్థ, నిధుల లేమిని సాకుగా చూపి మరో ఏడాది గడువు పొడిగించాల్సిందిగా ప్రభుత్వానికి లేఖరాశారు. దీనిపై ప్రభుత్వం ఏరీతిలో స్పందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

---

## సీబీఎస్‌కు గుండె 'కోత'

* రోడ్డు విస్తరణతో హ్యాంగర్ కోత
* జీహెచ్ఎంసీతో ఆర్టీసీ చర్చలు

న్యూస్‌టుడే, హైదరాబాద్: సుమారు ఎనభైఏళ్ల చరిత్ర కల సెంట్రల్ బస్ స్టేషను (ఇమ్లిబన్) కోతకు గురవ్వనుందా? అవుననే బదులిస్తున్నారు అధికారులు. రోడ్డు విస్తరణ కారణంగా సీబీఎస్ హ్యాంగర్‌ను కొంతమేర తొలగించక తప్పదని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. దీంతో సాధ్యమై నంత తక్కువ కోత జరిగేలా చూసేందుకు ఆర్టీసీ అధికారులు తంటాలు పడుతున్నారు.

మహాత్మాగాంధీ బస్ స్టేషను (ఎంజీబీఎస్) ఎదురుగా ఉండే సీబీఎస్‌కు ఘనమైన చరిత్ర ఉంది. 1930 దశకంలో నిజాం బేగంపేట వద్ద ఎయిర్‌పోర్టు నిర్మించినపుడు నాలుగు హ్యాంగర్(పైకప్పు) లను తయారు చేయించారు. వీటిలో విమానాలను ఉంచేందుకు వీలుగా ఈ హ్యాంగర్లను తయారు చేయించారు. అయితే మూడు మాత్రమే ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేయగా, మరొకటి ప్రస్తుతం సీబీఎస్ వద్ద ఏర్పాటు చేశారు. వీటి తయారీకి అవసరమైన ముడిసరకు మొత్తం ఆ రోజుల్లో లం డన్ నుంచి తీసుకొచ్చారు. ఈ హ్యాంగర్‌లో హెలికాప్టర్‌ను ఉంచేవారు. తర్వాత నగరంలో జనాభా పెరగడంతో దీనిని బస్ స్టేషనుగా మార్చారు. నగరం వివిధ ప్రాంతాలతోపాటు ఇతర జిల్లాలకు బస్సులు ఇక్కడి నుంచి నడిచేవి. తర్వాత మూసీనది సమీపంలో మహాత్మాగాంధీ బస్ స్టేషను నిర్మించడంతో ఇతర జిల్లాల బస్సుల రాకపోకలు అక్కడకి మారిపోయాయి. దీంతో ఈ హ్యాంగర్ ప్రాంతాన్ని సిటీసెంట్రల్ బస్ స్టేషనుగా మార్చారు. నగరం నలుమూలలకు సిటీ బస్సులు ఇక్కడి నుంచి బయలుదేరుతుంటాయి.

## తప్పని కోత

ఛాదర్‌ఘాట్ రోడ్డులోని దారుల్‌షిఫా మూడు రోడ్ల జంక్షన్ నుంచి ఎంజీబీఎస్ మీదగా వెళ్లే రోడ్డును విస్తరించాలని జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించారు. బస్సులరద్దీ పెరగడంతో తరచూ ఈ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఎంజీబీఎస్ లోపలి, సీబీఎస్ లోపలికి బస్సులు మలుపు తిరిగేటపుడు మలుపు వద్ద మరీ ఇరుకుగా ఉండటంతో రోడ్డు విస్తరణ తప్పని సరి అయింది. అయితే ఇప్పటికే సీబీఎస్ హ్యాంగర్‌లో కొన్ని ప్లాట్‌ఫారాలు మాత్రమే వినియోగిస్తున్నారు. రోడ్డువైపు ఉన్న ప్లాట్‌ఫారాలు వినియోగించకపోవడంతో కొంతమేర కోత వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే సాధ్యమైనంత తక్కువ ప్రాంతం మాత్రమే కోతకు గురయ్యేలా చూసేందుకు ఆర్టీసీ అధికారులు జీహెచ్ఎంసీ చర్చలు జరుపుతున్నట్లు ఓ ఆర్టీసీ ఉన్నతాధికారి తెలిపారు. ఇటీవలే హ్యాంగర్ మరమ్మతుకు రూ.3.5 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో అధికారుల చర్చలు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

---

కంప్యూటర్లో సాంకేతిక సమస్యలు...

## బీటెక్ విద్యార్థులకు సున్నా మార్కులు

జె.ఎన్.టి.యు. మే 30 (న్యూస్‌టుడే): వారంతా బీటెక్ చివరి ఏడాది పరీక్షలు రాశారు. భవిష్యత్తుపై బంగారు కలలు కంటున్నారు. ఒకరు అమెరికా..ఇంకొందరు ఆస్ట్రేలియా ఇలా ఎవరికి వారు ఇతర దేశాలకు వెళ్లేందుకు వీసాలు సైతం సిద్ధం చేసుకున్నారు. ఎదురుచూస్తున్న చివరి ఏడాది ఫలితాలను కూకట్‌పల్లి జేఎన్‌టీయూ అధికారులు ఈ నెల 28వ తేదీన విడుదల చేశారు. ఫలితాలనుజేఎన్‌టీయూతో పాటు పలు వెబ్‌సైట్లలో పెట్టినట్లు ప్రకటించారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన జేఎన్‌టీయూ గుర్తింపు పొందిన కళాశాలలలో నుంచి పరీక్షలు రాసిన విద్యార్థులంతా ఉరుకులు..పరుగుల మీద వెబ్‌సైట్లను తెరిచి ఫలితాలను చూసుకున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఐటీ కోర్సు చదువుతున్న స్వాతి, దివ్య, రామకృష్ణ, హరిష్, రాంచందర్, మహ్మద్ ముస్తఫాలు సైతం ఇలాగే ఫలితాలను చూసుకున్నారు. అన్ని సబ్జెక్టుల్లోనూ 60నుంచి 80శాతం మార్కులు వచ్చాయి. కానీ స్వాతికి బయోమెట్రిక్‌లో 3 మార్కులు, ఇతరులకు 'సున్నా' మార్కులు కనిపించాయి. అవాక్కవ్వడం వీరి వంతయ్యింది. విదేశీ కలలన్నీ కల్లలేనా..అని కొంతసేపు సర్వత్రా ఆందోళనతో ఒకరికొకరు ఫోన్లు చేసుకొని పరిస్థితిని సమీక్షించుకున్నారు. వీరంతా ఒకే క్లాసు కావడంతో మాట్లాడుకొని ఇదేదో తప్పిదం జరిగిందని మొత్తం 9మంది కలిసి అదే రోజు మధ్యాహ్నం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ పరీక్షా విభాగానికి వెళ్లి సంప్రదించారు. పరిస్థితిని వివరించడంతో అంతా సవ్యంగానే ఉందని తమ వద్ద ఏమీ తప్పిదం జరగలేదని సమాధానమిచ్చారు. దీంతో ఒక్కసారిగా విద్యార్థుల్లో తెలియని భయం..భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

### జేపీని సంప్రదించిన విద్యార్థులు

అధైర్యపడకుండా తమమీద నమ్మకంతో ఎట్టి పరిస్థితుల్లో మార్కులు ఇంత తక్కువగా వచ్చే అవకాశం లేదని సమీక్షించుకున్న విద్యార్థులంతా తెలివిగా వ్యవహరించి లోక్‌సత్తా అధినేత జయప్రకాష్‌నారాయణను కలిసేందుకు నిర్ణయించారు. బాలానగర్ సాయినగర్‌లో నివసిస్తున్న స్వాతి అనే విద్యార్థిని సమీపంలోనే ఉంటున్న లోక్‌సత్తా సభ్యులు ప్రదీప్‌కుమార్, సత్యనారాయణలను కలిశారు. వీరు గౌతం, సిద్ధూ, తాతారావుతో సంప్రదించి ఎమ్మెల్యే జేపీతో మాట్లాడి సమయం తీసుకొని శుక్రవారం వెళ్లి పార్టీ కార్యాలయంలో ఆయన్ని కలిసి తమ సమస్యను వివరించారు. దీంతో వెంటనే ఆయన జేఎన్‌టీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాంమోహన్‌రెడ్డితో మాట్లాడారు. తప్పకుండా పరిశీలిస్తామని ఆయన హామీ మేరకు విద్యార్థులంతా జేపీకి కృతజ్ఞతలు చెప్పుకొని ఎంతో ఆశతో జేఎన్‌టీయూకి చేరుకున్నారు. రాంమోహన్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో తిరిగి శనివారం వర్సిటీకి వెళ్లి ఆయన్ని కలిశారు. దీంతో డాటాబేస్‌ను సిస్టమ్‌కు కనెక్ట్ చేసి 9మంది విద్యార్థుల మార్కుల మెమోలను పరిశీలించారు. ఇంకేముంది అందులో ఎవ్వరూ తప్పలేదు. ఎవరికీ జీరో మార్కులు రాలేదు. అందరూ ఉత్తీర్ణులైనట్లు మార్కులు కనిపించాయి. ఒక్కసారిగా

విద్యార్థులు ఎగిరి గంతేశారు. అయితే జరిగిన తప్పిదంతో ఈ సారి అవాక్కవ్వడం అధికారుల వంతైంది. ఇలా జేఎన్‌టీయూ గుర్తింపు పొందిన పలు కళాశాలల నుంచి కూడా విద్యార్థులు ఇదే సమస్యతో శనివారం వర్సిటీకి రావడం గమనార్హం. బాధతో వచ్చిన వారందరూ మారిన మార్కుల ఆనందంతో మార్కుల మెమోతో తిరిగి వెళ్లడం కనిపించింది. నగరంలోని ఓ కళాశాలలో ఏకంగా ఒకే తరగతికి చెందిన 120మంది విద్యార్థులకు ఒక సబ్జెక్టులో సున్నాలు రావడం సంచలనం కలిగించింది. వీరంతా కూడా తర్వాత పాసైనట్లు వర్సిటీ నుంచి అందిన మార్కుల మెమోలతో తేలింది. లోక్‌సత్తా అధినేత జయప్రకాష్‌నారాయణ పుణ్యమా అని తమకు న్యాయం జరిగిందని స్వాతి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. తమకు సహకరించిన జేపీతో పాటు నాయకులు ప్రదీప్‌కుమార్, సత్యనారాయణకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

డౌన్‌లోడ్‌లో సమస్య వల్లనే...

తాము ఫలితాలను సదరు వెబ్‌సైట్లకు మెయిల్ చేస్తామని వాటిని వారు డౌన్‌లోడ్ చేసుకొని సైట్లలో పెడతారని కూకట్‌పల్లి జేఎన్‌టీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. ఇలా డౌన్‌లోడ్ చేసుకోవడంలో సాంకేతిక కారణాల వలన ఈ రకమైన సింగిల్ డిజిట్ మార్కులు, సున్నాలు వచ్చాయన్నారు. అయితే ఇటువంటి సమస్యతో తమ వద్దకు వచ్చిన విద్యార్థులందరికి పరిశీలించి నిజమైన పాస్ మెమోలను అందించినట్లు పేర్కొన్నారు. తమ వద్దేమీ సమస్య జరగలేదని కేవలం డౌన్‌లోడ్ చేసుకోవడంలోనే ఆయా వెబ్‌సైట్ల నిర్వాహకుల వద్దనే ఈ మార్పు జరిగిందని ఆయన సమాధానమిచ్చారు. ఇటువంటి అనుమానం ఉన్న వారెవరైనా సరే తమను సంప్రదిస్తే వాస్తవాలను పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

---

## ఒంటరి మగువలూ.. తెగువతో జీవించండి!

* ఆత్మవిశ్వాసం కనబరచండి
* అందుబాటులో కౌన్సెలింగ్ కేంద్రాలు
* జిల్లాకో 'ఉమెన్ ప్రొటెక్షన్' సెల్

న్యూస్‌టుడే, హైదరాబాద్: తల్లిదండ్రులను కోల్పోయి చేరదీసే బంధువులు లేక ఒంటరి పోరాటం చేసే యువతులు నగరంలో ఎంతోమంది ఉన్నారు. ఇక ఇతర జిల్లాల నుంచి ఉద్యోగాల రీత్యా నగరానికి చేరుకుని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లలో ఉండేవారు కొందరైతే భర్తను కోల్పోయి అత్తింటి ఆరళ్లను భరించలేక అందరికీ దూరంగా బతుకుతున్న వితంతువులు మరికొందరు. చదువుల నిమిత్తం హాస్టళ్లలోనో, బంధువుల ఇళ్లల్లోనో ఉండేవారూ లేకపోలేదు. ఇలాంటి వారందరూ తరచూ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుంటారు. బయటికెళ్తే చాలు టీజింగ్‌తో మొదలుకుని పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురయ్యేవారి సంఖ్య కూడా అధికమే. తమకు తాము ధైర్యం చెప్పుకోవడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో మెలిగితే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కోవచ్చు.

ఇవి పాటించండి

* నమ్మకస్తులు సూచించిన ఇల్లు లేదా అపార్ట్‌మెంటులో ఫ్లాటు తీసుకోండి. భద్రత విషయంలో భరోసా పొందండి.
* బంధువులను, స్నేహితులను తీసుకొచ్చి ఇంటి యజమానులకు పరిచయం చేయండి. తద్వారా మీరు 'ఒంటరి కాదు' అనే విషయం అందరికీ తెలుస్తుంది.
* మీ ఇరుగు పొరుగు వారితో కలిసి మెలసి ఉండండి. వారితో అన్ని విషయాలను చర్చించండి. అప్పుడే వారు మీకు సాయంగా ఉంటారు.
* ఎవరైనా పురుషులు చాలా రోజులుగా మీ ఇంటి వద్ద తచ్చాడుతుంటే వెంటనే మీ స్నేహితుల సాయంతో వారికి బుద్ధిచెప్పండి.
* మీరు తరచుగా సంప్రదించే వ్యక్తులతో (చాకలి, ఇస్త్రీ చేసే వ్యక్తి, కూరగాయలు, సరుకుల దుకాణదారులు) వ్యక్తిగత విషయాలు చర్చించవద్దు.
* నమ్మకమైన వ్యక్తిని పనిమనిషిగా నియమించుకోండి. ఈ తోడు ఒంటరితనాన్ని దూరం చేస్తుం

ది.
* మీ టెలిఫోన్ నెంబర్లు, మీ కంప్యూటర్ పాస్‌వర్డ్ ఎవరికి పడితే వారికి చెప్పొద్దు.
* మీరు ఇంట్లో ఉన్నప్పుడు ఎవరు వచ్చినా వెంటనే తలుపులు తెరవద్దు. తలుపు 'పీప్‌హోల్' ద్వారాగానీ, కిటికీ నుంచిగానీ చూసి నిర్ధారించుకోండి.
* పై అంతస్థులు అయితే లిఫ్ట్‌లే శ్రేయస్కరం. వాటిలో డోర్‌కు దగ్గరగా నిల్చోండి.
* అదేపనిగా ఎవరైనా టీజింగ్ చేస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి.
* బయటకు వెళ్లినప్పుడు సెల్ ఇయర్‌ఫోన్‌లు వాడొద్దు. వీటివలన మిమ్మల్ని ఎవరైనా అనుసరిస్తున్నారా.. దాడి చేయబోతున్నారా అనే విషయాలు గ్రహించలేరు.
* స్నేహితులతో 'ఫ్రెండ్‌షిప్' క్లబ్‌లు, పానీయాల విషయంలో జాగ్రత్తలు పాటించండి.
* జనసమ్మర్థ ప్రాంతాల్లోనే సంచరించండి.
* ఆత్మరక్షణార్థం పెంపుడు కుక్కలపై ఆధారపడకండి. మీవెంట హ్యాండ్‌బ్యాగుల్లో 'పెప్పర్‌స్ప్రేలు' ఉంచుకోండి.

---

## జీహెచ్ఎంసీలో అగ్నిప్రమాదాల నిరోధక విభాగం

### * 8 మంది అధికారుల నియామకం

న్యూస్‌టుడే, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో ఎట్టకేలకు 'అగ్ని ప్రమాదాల నిరోధక విభాగం' ఏర్పాటైంది. గ్రేటర్ పరిధిలో అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ, జీహెచ్ఎంసీతో కలిసి సంయుక్తంగా పనిచేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలంటూ అగ్నిమాపక శాఖ చేసిన ప్రతిపాదనల మేరకు, 2007 మార్చి 13న జీవో 154 జారీ అయ్యింది. ఎన్నో అవాంతరాల అనంతరం 'జీహెచ్ఎంసీ' కోసం ప్రత్యేక జీవోలు 278, 279 జారీ అయ్యాయి. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వైజాగ్, వరంగల్, విజయవాడ, తిరుపతి కార్పొరేషన్లలో కూడా ప్రత్యేక వింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతానికి తిరుపతి మినహా అన్ని కార్పొరేషన్లలో ప్రత్యేక అగ్రిమాపక నిరోధక విభాగం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ... ప్రభుత్వం జీవోలు 280, 282 జారీ చేసింది. జీహెచ్ఎంసీలో 8 పోస్టులు (అదనపు డైరెక్టర్, ఇద్దరు జిల్లా అగ్నిమాపక అధికారులు, అయిదుగురు స్టేషన్ ఫైర్ ఆఫీసర్లను), మిగిలిన నాలుగు కార్పొరేషన్లకూ మూడు పోస్టుల చొప్పున నియమించింది. ఈ మేరకు అదనపు డైరెక్టర్ జయరాంనాయక్ శనివారం జీహెచ్ఎంసీలో రిపోర్ట్ చేశారు. ప్రత్యేక విభాగం నేతృత్వంలో అధికారులు '15 మీటర్లకన్నా తక్కువ ఎత్తు ఉన్నవాణిజ్య సముదాయాలు, 8 మీటర్లకన్నా తక్కువ ఎత్తు ఉన్న నివాస గృహ సముదాయాల్లో అగ్నిమాపక ఏర్పాట్లు ఉన్నాయో... లేవో' తనిఖీ చేస్తుంది. టౌన్‌ప్లానింగ్ విభాగంతో కలిసి తనిఖీలు జరిపి... కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తారు.

### శిక్షణ కేంద్రంలో తనిఖీ

నానక్‌రాంగూడ సమీపంలోని గొలిదొడ్డిలో ఉన్న అగ్నిమాపక శాఖ శిక్షణ కేంద్రాన్ని శనివారం ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. పదోన్నతుల నిమిత్తం ఫైర్‌మెన్‌లకు, కొత్తగా నియమితులైన డ్రైవర్లకు జరుగుతున్న శిక్షణ తీరును పరిశీలించారు. తనిఖీలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రాంతీయ అగ్నిమాపక అధికారులు లక్ష్మీప్రసాద్, రమణలు పాల్గొన్నారు.

---

## కుటుంబ కలహాలతో పిల్లలను బాధించొద్దు

### * క్రిస్ప్ ఇండియా ఆందోళన

ఖైరతాబాద్, మే 30 (న్యూస్‌టుడే): కుటుంబాల్లో వస్తున్న కలహాల వల్ల వారి పిల్లలు నలిగిపోతున్నారని చైల్డ్ రైట్స్ ఇనిషియేటివ్ ఫర్ షేర్డ్ పేరెంటింగ్ (క్రిస్ప్) ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. భర్తల నుంచి సమస్య ఉత్పన్నమౌతున్నపుడు ఉండే స్పందన, భార్యల కారణంగా సమస్య ఉంటే తగినంతగా ఉండటం లేదని క్రిస్ప్ వ్యవస్థాపకులు కుమార్ వి.జాగీర్దార్ పేర్కొన్నారు. తన భార్య చేతన 14 ఏళ్ల కూతురుకు తల్లిదండ్రుల ఆప్యాయాన్ని దూరం చేస్తూ భారత్ లెగ్ స్పిన్నర్ అనిల్‌కుంబ్లేను వివాహం చేసుకుందని విచారం వ్యక్తం చేశారు. ఇదే కోవలో యూఎస్‌ఏలో స్థిరప

డిన డాక్టర్ వి.రవిచంద్రన్ తన కొడుకును దూరం చేసుకుని మానసిక క్షోభను అనుభవిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో కోర్టులు ఆదేశించినా తగిన న్యాయం జరగడం లేదన్నారు. రవిచంద్రన్ తను ఎదుర్కొన్న పరిస్థితులను వివరించారన్నారు. 2000వ సంవత్సరంలో అక్కడి విజయశ్రీ వరూతో ఆయనకు వివాహమైతే ఓ కొడుకు పుట్టాడని, 2005లో గొడవలతో విడిపోయారని, అనంతరం కుమారుడు ఆదిత్యను ఇద్దరి చెంతా ఉండేలా అక్కడి కోర్టు సూచించిందన్నారు. అయితే 2007లో ఆమె భారత్‌కు చేరుకుని, బాబును తనకు దూరం చేసిందన్నారు. ఈ విషయంలో అక్కడి కోర్టులు ఆమెపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేస్తూ, భారత సుప్రీంకోర్టుకు కూడా సూచించాయన్నారు. ఈ నేపథ్యంలో బాబు నలిగిపోతున్నాడని, ఈ పరిస్థితి మరెవ్వరికీ రావొద్దని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి భార్యా బాధితుల కేసులు దాదాపు ఐదు లక్షల దాకా ఉన్నాయని న్యాయవాది సీవీఎల్ నర్సింహారావు తెలిపారు. ఇలాంటి ఘటనల్లో పిల్లల క్షేమం, సత్వర న్యాయం కోసం ప్రత్యేక కోర్టు ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

---

## కూర రాజన్న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

బంజారాహిల్స్ మే 30 (న్యూస్‌టుడే): హృద్రోగ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనశక్తినేత కూరరాజన్న శనివారం సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అనంతరం ఆసుపత్రి వద్ద విలేకరులతో మాట్లాడుతూ తనకు చికిత్స జరిపిన వైద్యుల బృందం తనను ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోమన్నారని తెలిపారు. రాజన్నను కలిసిన అమర్‌తో ఏం మాట్లాడారని విలేకరులు ప్రశ్నించగా, అమర్ కేవలం ఒక గంట మాత్రమే తన వద్ద ఉన్నాడని, సమాజానికి, ప్రత్యేక తెలంగాణకు సంబంధించిన, రాజకీయ, జీవిత ఖైదీల క్షమాభిక్ష గురించిన విషయాలను తాము చర్చించామని తెలిపారు. తెలంగాణ సాధన కోసం ఉమ్మడిగా సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించాలని అమర్ సూచించాడన్నారు. ఉద్యమ తెలంగాణావాదులు చీలిపోవద్దని, నేతృత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అమర్ తెలిపాడని రాజన్న అన్నారు. పటేల్ సుధాకర్‌రెడ్డి ఎన్‌కౌంటర్ కూరరాజన్న స్పందిస్తూ దానిని బూటకపు ఎన్‌కౌంటర్‌గా అభివర్ణించారు. మహిళకు హోంమంత్రి పదవి ఇవ్వడంపై ఆయన వ్యాఖ్యానిస్తూ, మహిళలు 33 శాతం కాదు, 50 శాతాన్ని సాధించాలన్నారు. ఎవరో అవకాశం ఇస్తే పుచ్చుకోకుండా మహిళలు తమంతట తాము అవకాశాల్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఒక ప్రశ్నకు సమాధానంగా తెరాస ఓటమి తెలంగాణా ఓటమి కాదని, అయితే తెలంగాణ ఉద్యమంపై దాని ప్రభావం పాక్షికంగానైనా ఉంటుందని కూరరాజన్న అభిప్రాయపడ్డారు.

---

## వినియోగాన్ని తగ్గించడమే పొదుపు..!

* విద్యుత్తు ఆదాపై అవగాహన పెంచాలి
* సదస్సులో వక్తల సూచన

(న్యూస్‌టుడే-హైదరాబాద్): 'అవసరమైనంత వరకే విద్యుత్తును వినియోగించాలి. ఇది వ్యక్తిగతంగా ఖర్చును తగ్గించుకోవటంతో పాటు భవిష్యత్తు తరాలకు సహజ వనరులను దాచి పెట్టడమే...' అని వక్తలు పేర్కొన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్, అవ్‌కాన్ట్ సహకారంతో జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న సదస్సు శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును అవ్‌కాన్ట్ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ రమణాదేవి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎపెర్క్ సభ్యుడు సీఆర్ శేఖర్‌రెడ్డి హాజరయ్యారు. తొలుత పలువురు విద్యుత్తు పొదుపుపై ప్రసంగించిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి వచ్చిన జేవీవీ ప్రతినిధులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ వింగ్ కమాండర్ వీఎల్ నందకుమార్, నెడ్‌క్యాప్ ఎండీ ఎంపీ రెడ్డి, జేవీవీ గౌరవాధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు, మురళీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తం చేసిన అభిప్రాయాలు...

### మారిన జీవన శైలిని గుర్తించాలి: సీఆర్ శేఖర్‌రెడ్డి

విద్యుత్తు పొదుపుపై ప్రజల్లో అవగాహన పెరగాలి. అయితే ఇందుకోసం జరిగే ఉద్యమంగానీ, ప్రచారంగానీ మారిన జీవన శైలిని పరిగణనలోనికి తీసుకొని రూపకల్పన చేయాల్సి ఉంటుంది. విద్యుత్తును ఎక్కడ పొదుపు చేయాలి, ఎలా పొదుపు చేయాలి అనే విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. వినియోగించే పరికరాలూ విద్యుత్తును ఆదా చేసేవిగా ఉండాలి. గుజరాత్‌లోని పాఠశాలల చిన్నారుల ప్రతినెల మొదటి వారంలో ఒకరోజు ఒక గంట విద్యుత్తు వినియోగాన్ని నిలిపివేస్తారు. ఇది అందరికీ ఆదర్శం కావాలి.

### ప్రభుత్వాలు చొరవ చూపాలి: రమణాదేవి

విద్యుత్తు వినియోగాన్ని ప్రస్తుతం ఉన్న దానిలో 50 శాతం తగ్గించాలి. నిత్యకృత్యంలో అనేక అవసరాలకు సంబంధించిన వినియోగాన్ని తగ్గిస్తే చాలా మేరకు ఆదా అవుతుంది. ప్రజలు ఇలా చేసేలా ప్రోత్సహించాల్సిన బాధ్యతను ప్రభుత్వం భుజాన వేసుకోవాల్సి ఉంది. కాని ఆశించిన మేర ప్రభుత్వం నుంచి ఈ అంశంపై ప్రచారం జరగడంలేదు. విద్యుత్తు పొదుపుపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ప్రభుత్వం నిధుల కేటాయింపు పెంచాల్సిన అవసరముంది.

### ప్రతి ఒక్కరూ మేల్కొనాలి: ఎంపీ రెడ్డి

విద్యుత్తు పొదుపుపై ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. ఒక ఇంట్లో ఇద్దరు పిల్లలు వేర్వేరు గదుల్లో కూర్చొని చదువుకుంటారు. దీని వల్ల విద్యుత్తు వినియోగం పెరుగుతుంది. వారిద్దరూ ఒకే గదిలో చదువుకోవటం వల్ల విద్యుత్తు ఆదా అవుతుంది. ఇలాంటి చిన్న అంశాలు మొదలుకొని ప్రతి ఒక్క రంగంలోనూ విద్యుత్తు ఆదాపై చైతన్యం రావాలి.

---

## మూలకు చేరుతున్న బల్లలు!

* స్క్రూలు డిపోతున్న వైనం
* రూ.5.88 కోట్లు వృథాయేనా?

న్యూస్‌టుడే, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు కూర్చొనేందుకు వీలుగా కొనుగోలు చేసిన దాదాపు 16 వేల బల్లలో నాణ్యత లోపాలు వెలుగు చూస్తున్నాయి. ఏళ్ల తరబడి మన్నాల్సినవి కాస్తా... కొనుగోలు చేసిన కొద్ది నెలలకే మూలకు చేరుతున్నాయి.

హైదరాబాద్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బల్లలు కొనుగోలుకు గత ఏడాది ఆరంభంలో జీహెచ్ఎంసీ రూ.3.15 కోట్లు మంజూరు చేసింది. కొనుగోలు బాధ్యతలు కలెక్టర్, రాజీవ్ విద్యామిషన్‌లకు అప్పగించారు. తొలుత 10 వేల బల్లలు కొనుగోలు చేయాలని నిర్ణయించి టెండర్లు పిలవగా, చెన్నైకి చెందిన ఎర్గోమ్యాక్స్ రూ.3,680 చొప్పున 8 వేల బల్లలు సరఫరా చేసేందుకు ముందుకొచ్చింది. ఈ టెండర్లలో రేట్ ఎక్కువగా కోట్ చేసినందున గోద్రెజ్ సంస్థకు టెండరు దక్కలేదు.

### రెట్టింపు సంఖ్యలో కొనుగోలు చేసినా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ని బల్లలు అవసరమో వివరాలు అందజేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ కోరారు. దీంతో సుమారు 16 వేల వరకు బల్లలు అవసరమని గుర్తించారు. దీంతో మరో 8 వేల బల్లలు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. వీటి సరఫరా బాధ్యతను గోద్రెజ్‌కు అప్పగించారు. అంతకు ముందు టెండరు దక్కించుకున్న ఎర్గోమాక్స్‌కు ఇచ్చిన ధరకే గోద్రెజ్ సంస్థ బల్లలు సరఫరా చేసేలా అనుమతిచ్చారు. బల్లల నాణ్యత పరిశీలనకు వెళ్లిన బృందంలో అవగాహన లేనివాళ్లు ఉన్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత ఆగస్టు నుంచి బల్లలు పాఠశాలలకు సరఫరా అయ్యాయి. కేవలం రూ.3.15 కోట్లు మాత్రమే నిధులుండగా రూ.5.88 కోట్లు విలువైన బల్లలు కొనుగోలు చేయడంతో మిగిలిన నిధుల కోసం ఆర్వీఎం అధికారులు తంటాలు పడ్డారు. చివరకు ఆర్వీఎం నిధుల నుంచి వాటిని సర్దుబాటు చేయాల్సివచ్చింది. పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బల్లల స్క్రూలు డిపోతున్నాయి. విద్యార్థులు కూర్చునే పరిస్థితి కూడా లేదు. వచ్చే

నెలలో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం నుంచి పలు పాఠశాలల్లో బల్లలుండీ విద్యార్థులు కింద కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

'నిధులు చెల్లించకుండా నిలిపేస్తాం'

బల్లల నాణ్యత లోపాలతో మూలకు చేరుతున్నట్లు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని హైదరాబాద్ జిల్లా రాజీవ్ విద్యా మిషన్ పథకం అధికారి (పీవో) తెలిపారు. రెండు సంస్థలకు నిధులు మొత్తం చెల్లించేటపుడు, ఒక్కో సంస్థ నుంచి రూ.30 లక్షల చొప్పున బ్యాంకు గ్యారంటీ ఉంచామన్నారు. రెండేళ్ల గ్యారంటీ ఉన్న బల్లలు పాడయితే... నిధులను ఆయా సంస్థలకు చెల్లించకుండా నిలిపేస్తామన్నారు. బల్లల నాణ్యత విషయంలో పక్కాగా వ్యవహరించినట్లు ఆయన తెలిపారు.

---

## మహిళను కాబట్టే ముందుగా మహిళా జైలుకు వచ్చా..!

* హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి
* జైళ్ల తనిఖీలకు శ్రీకారం

న్యూస్‌టుడే, హైదరాబాద్: 'నేను మహిళను కాబట్టి మహిళా పక్షపాతిగా నా తొలి పర్యటన, తనిఖీ మహిళా జైలులో చేశాన'ని హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి అధికారిక పర్యటనలో చంచల్‌గూడ మహిళా జైలును సందర్శించడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె పైవిధంగా స్పందించారు. జైళ్లలో జరుగుతున్న దారుణాలు, ఖైదీలు సెల్‌ఫోన్ల వాడకం, వారి ఆరోగ్య సమస్యలు వంటి విషయాల్లో తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. త్వరలో అన్ని జైళ్లను తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని జైళ్లలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక నివేదిక తెప్పించుకుని అధికారులతో చర్చిస్తానని ప్రకటించారు. డీజీపీ కార్యాలయంలో మహిళపై లైంగిక వేధింపుల విషయమై నివేదిక వచ్చాక విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. జైళ్లలో సెల్‌ఫోన్లు పనిచేయకుండా జామర్లను ఏర్పాటు చేయాలని గతంలో వచ్చిన ప్రతిపాదనపై హోంమత్రి స్పందిస్తూ ఆ విషయం ఎంతవరకు వచ్చిందో అధికారులతో చర్చిస్తానన్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ల పెంపు

మహిళా పోలీస్‌స్టేషన్ల సంఖ్య పెంచే దిశగా ఆలోచిస్తున్నట్లు హోంమంత్రి తెలిపారు. మహిళా జైళ్ల సంఖ్య పెంచే ఆలోచన లేదుగానీ పోలీస్‌స్టేషన్లతోపాటు మహిళా పోలీసులను పెంచే ఆలోచన ఉన్నట్లు సూచనప్రాయంగా తెలిపారు.

---

## లేఅవుట్ క్రమబద్ధీకరణ రెండో విడత ప్రారంభం

* సర్కిల్ కార్యాలయాలకు చేరిన దరఖాస్తులు
* రేపటి నుంచి ఉత్తర్వులు జారీ
* దరఖాస్తుకు గడువు పెంపు

(న్యూస్‌టుడే-హైదరాబాద్): లేఅవుట్ క్రమబద్ధీకరణ ప్రక్రియపై గ్రేటర్ అధికారులు రెండో విడత కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను సర్కిళ్ల వారీగా విభజించి... క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు ఆయా కార్యాలయాల్లో సోమవారం నుంచి దరఖాస్తులను అందుబాటులో ఉంచనున్నారు. మొదటి విడతలోనే పూర్తి అపరాధ రుసుమును చెల్లించిన వారికి వెంటనే అనుమతి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. బకాయి మొత్తం ఉన్న వారు అక్కడే చెల్లిస్తే వారికీ ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు గ్రేటర్ అధికారులు తెలిపారు. మరోవైపు లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు గడువును మరో నెల రోజుల పాటు పెంచుతున్నట్లు కమిషనర్ ప్రకటించారు. జూన్ 30వ తేదీ వరకు 10 శాతం జరిమానా రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సోమవారం నుంచి జారీ అయ్యే క్రమబద్ధీకరణ కోసం ఆయా సర్కిళ్లలో ఉన్న దరఖాస్తుల సంఖ్య వివరాలు ఇలా ఉన్నాయి.

---

# మోడల్ పరీక్షలతో విద్యార్థుల ప్రతిభ మెరుగు

* కలెక్టర్ నవీన్‌మిట్టల్

* ఈనాడు-ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకర్లకు బహుమతులు ప్రదానం

న్యూస్‌టుడే, హైదరాబాద్: పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులు మోడల్ పరీక్షల ద్వారా తమ ప్రతిభను పరిశీలించుకునేందుకు అవకాశం లభిస్తుందని హైదరాబాద్ కలెక్టర్ నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు. 'ఈనాడు'-ఆకాశ్ ఐఐటీ ఇన్‌స్టిట్యూట్ నగరంలో సంయుక్తంగా నిర్వహించిన ఎంసెట్, ఐఐటీ,జేఈఈ, ఏఐఈఈఈ మోడల్ పరీక్షల్లో వందలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ నవీన్‌మిట్టల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పరీక్షకైనా తీవ్ర పోటీ ఉన్న ఈ రోజుల్లో ఇలాంటి పరీక్షలు విద్యార్థులకు దోహదపడతాయన్నారు. తమ లక్ష్యాన్ని చేరుకోడానికి ఇవి మార్గదర్శకంగా ఉంటాయన్నారు.
ఆకాశ్ ఐఐటీ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ హెడ్ అరుణ్‌సింగ్ మాట్లాడుతూ పిల్లల ప్రతిభను వెలికితీసే ఈ పరీక్షలకు తమ సంస్థ తరపున సహకరించామన్నారు. ఈనాడు ప్రకటనల విభాగం జనరల్ మేనేజర్ ఇమ్మాన్యుయెల్ మాట్లాడుతూ మూడేళ్లుగా 'ఈనాడు' ఆధ్వర్యంలో ఇలాంటి మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ఏఐఈఈఈ, ఐఐటీ, ఎంసెట్ ఇంజినీరింగ్, మెడిసిన్ పరీక్షల్లో నగరానికి చెందిన విద్యార్థుల్లో 169 మంది ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం పలువురు ర్యాంకర్లకు నగదు, ల్యాప్‌ట్యాప్‌లు అందజేశారు. మెడికల్‌లో టాపర్‌గా నిలిచిన కీర్తన, రెండోస్థానంలో నిలిచిన ఎం.కీర్తి, ఇంజినీరింగ్‌లో ద్వితీయ ర్యాంకు సాధించిన భావన, తృతీయ ర్యాంకు దక్కించుకున్న కె.స్నేహ, ఏఐఈఈఈలో ప్రథమర్యాంకు సాధించిన ధీరజ్, ఐఐటీలో తృతీయ ర్యాంకు సాధించిన అవినాష్, ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు కలెక్టరు నవీన్‌మిట్టల్, అరుణ్‌సింగ్, ఇమ్మాన్యుయెల్ చేతుల మీదుగా బహుమతులు పొందారు.

---